వి హా రి

కోటి విద్యల్లోనూ చేరనిది

స్ప్రింగ్ లాగా...

శారద తక్కున మొహం మాడ్చుకుంది. వాడివైపు మిర్రి మిర్రి చూసింది. "అయితే – అయిదేళ్లు తప్పదా ఈ కొలువు" అని ఆమె గుండెల్లో రాయి పడినట్లైంది. నా కళ్లల్లోకి చూసింది. ఆమెని ఉడికించడానికి, నేను సీతాపతికి హామీ నిచ్చాను, అవునవునని.

అవునుమరి – కడకు జరగబోయేది అదేకదా ఎటొచ్చీను!

రోజులు గడుస్తున్నాయి.

సీతాపతికి – పండుగ సరదాలూ, పర్వాలకు కొత్త బట్టల్లాంటి సదుపాయాలూ–అన్నీ మా పిల్లలతోపాటు జరిగిపోతున్నాయి. ఆయా సందర్భాలకి ముందు విసుక్కోవడం, సణుక్కోవడం–శారదకి అలవాటైపోయింది. కానీ, ఆమె రివాజునిమ్మిత్రం నేను మరిచిపోయే వాణ్ణి కాదు. తీరా ఆ సమయానికి – "పిచ్చి వెధవ. వాణ్ణి వేరుగా ఎట్టా చూస్తామండీ–వాడికీ చొక్కాలాగూ తెండి"అనో; "పరీక్షలు అయిపోయాయి గదా – సినిమాకు పోతాట్ట పంపించండి" అనో; "నెల రోజులు సెలవులట. గోళ్లు గిల్లుకుంటూ ఇక్కడేం చెయ్యాలని గొడవ పెట్టున్నాడు – వూరికి పంపండి" అనో – సిఫారసు వచ్చేది.

బియ్యేలో చేరేడు – సీతాపతి.

మేం కాపరముంటున్న ఇంట్లో—వున్న నాలుగు గదుల్లోనూ ముందు గది తనకు ప్రత్యేకించమని వో అభ్యర్థన పారేశాడు సీతాపతి వో రోజు.

మా రమ ఎనిమిదిలోనూ, రాణి ఐదులోనూ, చంద్రం రెండులోనూ చదువుతున్నారప్పుడు. అన్నయ్యలాగానే మాకూ గది కావాలని గునిసింది రమ. దాన్ని నాలుగు తిట్టి — సీతాపతికి గదిని కేటాయించింది శారద.

అప్పుడప్పుడూ మా అన్నయ్య — కొడుకుని చూసిపోవడానికనే నెపంతో వస్తూ వుండేవాడు. వచ్చినప్పుడు తన బాధలేవో వెళ్లబోసుకునేవాడు. ఆయన మా పల్లెలో ప్రాథమిక పాఠశాలోపాధ్యాయుడు! తిరిగి వెళ్లేటందుకు ఛార్జీలూ, దారిబత్తెం నాకు వదిలేవి. అలాగే, సీతాపతి– అన్నయ్య—సుబ్రమణ్యం—అడపా దడపా—తగిలేవాడు!

కాలేజీలో ఎక్స్‌కర్షన్ వేశారు. మద్రాసు, బెంగుళూరు, మైసూరు, బేలూరు, హళేబీడు వగైరా. సీతాపతి తన కోరికని వెలిబుచ్చాడు. నేను డబ్బు ఇబ్బంది గురించీ, క్రితం నెలలోనే తీసుకున్న సొసైటీ అప్పు గురించీ—వాడికి వివరించాను.

ముభావంగా ఊరుకున్నాడు. రెండు రోజులు వాళ్ల పిన్నిదగ్గర 'రికార్డు' పెట్టేడు. ఆ తర్వాత మరో రెండు రోజులు నిరాహారదీక్ష వహించాడు—కారణాలు అడిగితే, "ఏం లేదు— ఆకలి కావడంలేదు" అంటూ. వాడి మొహం! -- వాడి మొహం చూస్తే తెలీడంలా మాకు?!

వాడి సాధింపే నెగ్గింది. వెళ్లేడు—విహారయాత్రకి! నాకు నాలుగు వందలూ వదిలినై!

బియ్యే మూడో ఏడు జరుగుతోంది. వో అర్ధరాత్రి అన్నయ్యా వదినా దిగేరు. ఆవిడకి మళ్లీ ఐదో నెలట! వచ్చిన పని విని నాకు నవనాడులూ కుంగిపోయి నిస్సత్తువ ఆవహించింది. పెద్దపిల్ల శోభకి పెళ్లి సంబంధం కుదిరిందిట. నాలుగువేలు కట్నానికి వొప్పుకోక తప్పలేదుట. పిల్లవాడు ఏదో మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో నెలకో మూడువందల జీతంలో కుదురుకున్నాడట. అంతగా చదువూ సంధ్యా లేని పిల్లకి ఇంతకంటే మంచి సంబంధం ఇకముందు దొరకటం అసాధ్యమట. ముహూర్తం కూడా నిర్ణయించుకుని నా దగ్గర వాలేరుట. నెలరోజులు లేదు పెళ్లిరోజు!

అతి కష్టంమీద మూడువేలు పుట్టించేసరికీ—ఆరు రోజులు పట్టింది. పట్టుకుపోయారు. వాళ్లిద్దరికీ కొత్తబట్టలు పెట్టి మరీ పంపించింది శారద.

"పని సాధించడంలో బాబాయి తర్వాతే ఎవరైనా. నా కా నమ్మకం వుంది. అన్యథా శరణం నాస్తి అంటే—ఏ ఇబ్బందిపడ్డైనా సహాయం చేస్తాడు మాబాబాయ్" –అని నా ఘనతని మెచ్చుకున్నాట్ట సీతాపతి, ఆవేళ — వాళ్ల పిన్నిముందు!

శోభ పెళ్లి జరిగింది. పెళ్లికి వెళ్లి వచ్చేసరికీ మరో ఐదు వందలు పప్పు బెల్లాల్లా ఎగిరిపోయాయి!

ఫైనల్ పరీక్షలు రాసి యింటికెళ్లేడు సీతాపతి.

ఫలితాలు తెలిసేయి. థర్డ్ క్లాస్‌లో పాసయ్యాడు. 'పోనీలే—ఏదో గట్టెక్కాడు' అనుకుని ఊపిరి పీల్చుకున్నాం నేనూ, శారదా.

మరో పదిరోజులకి వచ్చేశాడు — సీతాపతి. మార్కులూ, సర్టిఫికెట్లూ వగైరా అందేసరికీ నెల దాటింది.

"నేను ఎం. ఏ. చదువుకుంటాను బాబాయ్. కాదనబోకు. నీ ఋణం వుంచుకోను. ఎం. ఏ .లో కష్టపడి క్లాసుకూడా తెచ్చుకుంటాను. లెక్చరర్ ఉద్యోగం చేయాలన్నది — నా జీవితాశయం. నువ్వు వేసిన నిచ్చెనని సగంలో క్రిందకి లాగెయ్యవద్దు" ప్రాధేయ పూర్వకంగా అడిగేడు.

నేను వాడి జీవితాశయాన్ని హర్షించినా, బురద పాము ఆదిశేషుడితో వియ్యాన్ని కోరుతున్నట్టనిపించింది నాకు—వాడి పథకాన్ని వినేసరికీ.

శారద ప్రతిఘటనని వాడు ముందే అంచనా వేశాడల్లే వుంది —ఈసారి. సరాసరి, వ్యాపారవేత్తలా అందుకున్నాడు "ఎమ్మేకయ్యే ఖర్చంతా లెక్క రాసుకుందాం. నేను ఉద్యోగంలో చేరగానే తిరిగిచ్చేస్తాను. అఫ్‌కోర్స్—వాయిదాలమీద."

వాడి మాటలకి నాకు నవ్వొచ్చింది. 'సరే — చూద్దాం కానీ అసలు సీటు రావాలి కదా' అన్నాను, కప్పదాటు ధోరణిలో.

వాడికి భోపాల్‌లో సీటు దొరికింది. పల్లెకిపోయి వాళ్ల నాన్నతోనూ మా అమ్మతోనూ వాడి కోరిక గురించీ, నా పరిస్థితి

గురించీ చెప్పేను. మా అన్నయ్యేమో—"వాడు తీరుస్తానంటున్నాడు గదా—పంపించు" అన్నాడు. అమ్మేమో—'ఒక్కడి భవిష్యత్తునన్నా బాగుచెయ్' అంది. తల పట్టుకుని నా ఆలోచనల్తో నేను తిరిగి వచ్చాను.

సీతాపతి ఎమ్మే పూర్తిచేసి వచ్చాడు.

వాడు చెప్పినట్లే క్లాసు తెచ్చుకున్నాడు. 58 శాతం వచ్చేయి మార్కులు.

నాకూ గర్వం లాంటి భావనే కలిగింది — వాణ్ణి చూసేసరికీ. భోపాల్లో రెండేళ్ళూ గడిపి వచ్చేసరికీ—వాడు బాగా వొళ్ళు చేశాడు. దానికి తగ్గట్టు దట్టంగా మీసాలు పెంచేడు. మొత్తానికి యూనివర్శిటీ నుంచీ వో విధమైన దర్పాన్ని వెంటబెట్టుకుని తిరిగివచ్చాడు.

సరిగ్గా అదే సమయానికి — వాడు బియ్యే చదివిన కాలేజీలో జూనియర్ లెక్చరర్ పోస్ట్ ఖాళీ పడింది. వాడు దరఖాస్తు చేసేడు.

మళ్లీ మామూలు తతంగం మొదలైంది. వాడు ఎలాగైనా సరే తనకా అవకాశం జారిపోకుండా చూడమనీ, జగన్నాథంగారిని బ్రతిమాలో, బామాలో — ఉద్యోగం వచ్చేటట్టు చెయ్యమనీ — నా చెవిన యిల్లు కట్టుకుని పోరేడు.

ఆ ఉద్యోగానికి బలమైన పోటీ వున్నట్టు తెలిసింది. జారుడు మెట్టు మీద విన్యాసం మొదలైంది.

సీతాపతికి రోజులు బాగున్నాయి. లెక్చరర్ అయినాడు!

ఆరాత్రి — కలత నిద్రతోనే గడిచింది నాకు. వాడి ఎమ్మేకి అయిన ఆరున్నర వేలూ కళ్లముందు కదలాడిన్నై. శారద ఇరుగు పొరుగు వాళ్లతో మా సీతాపతి ఘనత గురించీ, తన ఆదరణ గురించీ చెప్పుకోసాగింది.

మొదటి నెల జీతం రోజుకి మా అన్నయ్య వచ్చి కూర్చున్నాడు —"శోభని పురిటికి తీసుకొచ్చాం—డబ్బు కావా"లంటూ.

సీతాపతి నా సలహా అడక్కుండానే తండ్రికి జీతం కవరుని అందించేడు.

నెల వెంట నెల వెళ్లిపోతూ వుంది. ఒక నెలలో తనకు కావలసిన బట్టలకి సరిపోయిందనీ, మరో నెలలో రేడియో కొన్నాననీ, ఇంకో నెలలో పళ్లెకు పోయొస్తాననీ — ఇలా తన జీతంలో కొంచెం కూడా నాకు రుచి చూపించకుండా గడుపుకు రాసాగేడు సీతాపతి.

పిల్లి తలమీద నేతిచుక్క వేసి చూడు — అది తలంతా గీరుకుని గీరుకుని తన చావు తానే చస్తుందని నా చిన్నప్పుడు మా అమ్మ చెప్తూ వుండేది—ఆశని గురించి కథ చెప్పే సమయంలో.

శారద పరిస్థితీ, నా పరిస్థితీ ఇందుకు భిన్నంగా ఏమీలేదు. ఇంకొక్క నెల...ఇంకొక్క నెల...చూద్దాం అని నెట్టుకు రావడానికి అలవాటుపడ్డాం.

ఒక సాయంత్రం —

మా రమ కాలేజీ నుంచీ వస్తూ ఆ వార్తని మోసుకొచ్చింది. అది సీతాపతి పనిచేసే కాలేజీలోనే మొదటి బియ్యే చదువుతోంది.

సీతాపతిని ఎవరో ప్రభావతి అనే అమ్మాయి అన్నయ్య పెద్ద యాగీ చేసి వెళ్లాట్ట — కాలేజీలోనే. క్షణాలమీద కాలేజీ అంతా ఈ వార్త పాకిపోయి, పరిస్థితి ఉద్రిక్తంగా మారిపోయిందిట. ప్రిన్సిపాల్ సీతాపతిని పిలిపించి మందలించాడని స్టూడెంట్స్ ఛోగట్టా.

ఇంటికి రాగానే సీతాపతికేసి చూశాను—పరీక్షగా. శారద చిర చిర లాడుతోంది, లోపలి గదిలో. వాడిలో ఎలాంటి కళవళమూ లేదు. చాలా నిబ్బరంగా వున్నాడు. ఏం చెప్తాడో వినాలని ఎదురు చూస్తూ కూర్చున్నాను.

నిముషాలు గడచిన్నై.

సీతాపతి వచ్చి, నిమ్మళంగా మొదలెట్టేడు. 'రాఘవరావు గారని సినిమా హాలు వోనర్. వాళ్లమ్మాయి — ప్రభావతి. సెకండియర్లో వుంది. నేనూ ఆయమ్మాయీ పెళ్లి చేసుకుంటాం. నువ్ వాళ్లకి చెప్పి ఎలాగైనా వాళ్లీ పెళ్లికి వొప్పుకునేట్టు చూడు.'

శారద గయ్న లేచింది — చేసిన నిర్వాకం చాలుగానీ మాకీ జగడాలూ, అప్రతిష్టా కట్టబెట్టకంటూ. ఆమె విసుర్లకీ, విసుగుదలకీ వాడేమీ సమాధానం చెప్పకుండా కూర్చుండిపోయాడు.

భారతి

చందా వివరములు

ఏజంటుద్వారా పోస్టులో

విడి ప్రతి రు. 2-00 -

సంవత్సరచందా రు. 24-00 25-80

ఒకేసారి ఆంధ్రపత్రిక ఆఫీసుకు
నేరుగా చెల్లిస్తే సంవత్సరచందా 18-00

మేనేజరు
భారతి

ఆ ర్రాత్రి ఇంట్లో భోజనాలు లేవు — ఎవ్వరికీని.

పదిహేను రోజుల్లో అంతా సద్దుమణిగింది. సీతాపతి పెళ్లి కొడుకయ్యాడు. ప్రభావతితో కాపరమూ పెట్టేశాడు—అదే నెలలో. మా శారద ఉడుక్కుంటూనే వేరింటి కాపరానికి అన్నీ సమకూర్చి పంపింది.

నాకు తిరుపతికి బదిలీ అయింది హఠాత్తుగా.

నేను—వెన్ను వంచి, ముక్కు మూసుకుని వంగి నిలబడితే, నామీదుగా, ఒక్కటొక్కటిగా తరలి వెళ్లిపోతున్నై - కెరటాలు!

*　　　*　　　*

మూడేళ్ల తర్వాత —

సీతాపతి దగ్గరకి పోయి రావాలని బయల్దేరేను.

ఈ మూడేళ్ల నుంచీ వాడి గురించి అప్పుడప్పుడూ తెలుస్తూనే వుంది. పల్లెకి వెళ్లినప్పుడల్లా మా వదిన వాణ్ణి గురించి చెప్తూ చాలా మురిసిపోతూ వుండేది. వాడిప్పుడు బాగా ప్రయోజకుడైనాడట. ఇల్లు కొనుక్కున్నాట్ట. ఇంటినిండా "స్టేటస్ సింబల్స్" అనబడే వాటినీ సమకూర్చుకున్నాట్ట! వాళ్ల నాన్న మాత్రం మొహం అదోలాపెట్టి—'ఆఁ...ఆఁ. అన్నీ వున్నై. నీకూ నాకూ నోట్లో మట్టి బెడ్డలు మాత్రం తప్పటల్లేదుగా' అనడం నేను విన్నాను.

సీతాపతి సంపద తనకే విధంగానూ ఉపయుక్తం కావడంలేదనే సూచనని మా అన్నయ్య అలా తెలియజేశాడు నాకు.

సీతాపతికి ఇప్పుడు ఇద్దరు మగపిల్లలు కూడానట!

సీతాపతి ఆలోచనలతో—రమ పెళ్లి గురించిన అనేకానేకమైన ఆందోళనలతో—వాడి యిల్లు చేరుకున్నాను.

సీతాపతి నిజంగానే జీవితంలో ఎదిగిపోయినట్టు, ప్రయోజకుడైనట్లు—వాడి యిల్లు, ఇంటి వాతావరణం తెలియజేస్తూ నన్ను ఆశ్చర్య సంతోషాల్లో ముంచేసినై. ఇల్లాలు నన్ను చాలా ఆదరణతో ఆహ్వానించింది. నేను అలసట తీర్చుకుంటూ కూర్చున్నాను. వాడు వచ్చాడు. నేను ఇంతకాలానికి వాణ్ణి చూడటానికి వచ్చినందుకు చాలా సంబరంగా వుందన్నాడు.

భోజనాలైనాయి. డాబామీద కూర్చున్నాం. పెరట్లో నైట్ క్వీన్ వాసన, దశమి వెన్నెల—మనసుల్ని ఆహ్లాదపరుస్తున్నై.

సీతాపతి మొదలెట్టేడు, "చూసే వాళ్లకంతా నేనేదో సంపదల్లో మునిగి తేలుతున్నట్టనిపిస్తుంది. మా మామగారి ఆస్తి నాదైనట్టు మాట్లాడతారు. అయనకి ఇద్దరు కొడుకులు ఎదిగిన వాళ్లున్నారు. ఇల్లు కొనాల్సిందేనని పట్టుపట్టి కొనిపించింది — ప్రభ. చూశావుగా, దీనిమీద ఇంకా ఇరవై వేల అప్పుంది..."

నేను ఉలిక్కిపడ్డాను. పరిసరాలూ, పరిస్థితులూ నాకేదో హఠాత్తుగా జ్ఞానోదయం చేస్తున్న అనుభూతి కలిగింది.

సీతాపతి ఏదో చెప్పుకుపోతున్నాడు, "ఈ కారణాలవల్లనే నీకు ఇన్నేళ్లూ పైసాకూడా పంపలేకపోయాను. రమ వివాహానికన్నా నీకు సహాయం చేద్దామంటే — నేనిప్పుడు పూర్తిగా మోకాలుబంటి బురదలో కూరుకుపోయి వున్నాను..."

నా రాకలోని ఆంతర్యాన్నయినా అర్థం చేసుకున్నందుకు సీతాపతిని మెచ్చుకుంది నా మనస్సు.

ఇక్కడికి బయల్దేరబోతూ వుండగా శారద చేసిన హెచ్చరిక గుర్తొచ్చింది.

ఆమె అన్నది, "నా కెందుకో సందేహంగా వుంది. సీతాపతి తన బాధల్నీ, ఇబ్బందుల్నీ తాను ఏకరువు పెట్టొచ్చు. మీరు మౌనవ్రతం పట్టి తిరిగి వచ్చేయకండి. అప్పో సొప్పో చేసి ఇవ్వమనండి. కట్నం సొమ్ముకు మనం ఇబ్బంది పడకుండా వుండాలంటే మీరు కొంచెం నిక్కచ్చిగా అడక్క తప్పదు."

'లౌకికం తెలిసిన ఇల్లాలేకాదు — శారద — మనసుల్నీ బాగానే చదివింది' అనిపించింది నాకు.

"నీకు నిద్ర పట్టినట్టుంది. పడుకో" అంటూ డాబా దిగి వెళ్లిపోయాడు, సీతాపతి.

నాకు నవ్వొచ్చింది. "నిద్రెలా పడుతుందిరా—పిచ్చి వెధవా" అని గొంతు చించుకుని మరీ అరవాలనిపించింది. అసహనంగా జుట్టు పీక్కున్నాను.

"నిక్కచ్చిగా" అడగమని — నా కళ్లముందు ప్రత్యక్షమై హెచ్చరిస్తోంది శారద.

సీతాపతి రూపమూ కళ్లముందు కదలాడింది, వాడిలో ఎదుటివాణ్ణి స్వలాభానికి మంచినీళ్ల ప్రాయంగా వాడుకుని చల్లగా జారుకునే ధీమంతుడు కనిపిస్తున్నాడు! నోరు తెరచి అడిగినా చేకూరే ప్రయోజనం ఏముంటుంది?

సీతాపతి నా గురించి ఎప్పుడో వెలిబుచ్చిన అభిప్రాయం నా చెవుల్లో గింగురుమంది— 'అన్యథా శరణం నాస్తి అంటే ఏ ఇబ్బంది పడైనా సరే సహాయం చేస్తాడు—మా బాబాయ్!'

ఆవేళ—వాడు నా కిచ్చిన యోగ్యతాపత్రం అది!

ఇవ్వాళ—నాకు ఒక గొప్ప సత్యం తెలిసింది.

మనిషిలో ఎంతో లోతుగా నాటుకుపోయిన కొన్ని బలహీనతలకే ఇలాంటి యోగ్యతా పత్రాలు లభిస్తాయి!

వాటితో — శుష్క హస్తాల్నీ, శూన్య ప్రియాల్నీ పొట్లాలు కట్టుకోగలగడం—నాలాంటివాడు ఇకముందు నేర్చుకోవలసిన విద్య!!